
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు 5
గురువారం 5 జూన్ 2025



కర్నూలు నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహ

కర్నూలు క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహను నియమిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సీఐ మధుసూదన్‌గౌడు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన అరెస్టయి రిమాండ్‌లో ఉండగా.. పోలీసు అధికారులు ఆ సీఐని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానం ఖాళీగా ఉండటంతో వీఆర్‌లో ఉన్న విక్రమ సింహను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం విక్రమ సింహ బాధ్యతలు స్వీకరించనున్నారు.

కౌలు రైతులకు సీసీ, ఆర్సీ కార్డులు ఇవ్వండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అర్హులైన కౌలు రైతులందరికీ సీసీ, ఆర్సీ కార్డులు పంపిణీ చేయాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రభుత్వ చౌక దుకాణాల నిత్యావసర సరుకుల పంపిణీ ప్రజాభిప్రాయం, సీసీ ఆర్సీ కార్డులు, పీజీఆర్ఎస్ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు. కార్డుల పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు కేవలం 1606కార్డులను మాత్రమే పంపిణీ చేశారన్నారు. ప్రభుత్వం నిర్దేశించి 30వేల సీసీ ఆర్సీ కార్డుల లక్ష్యాన్ని జూన్, జూలై లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో పరిష్కరించడంతోపాటు రీఓపెన్ దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు.



మహానంది కష్టాలు

- వ్యాపారుల వైపే అధికారుల దృష్టి
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు
- యాత్రికులను దోచేస్తున్న హోటళ్ల నిర్వాహకులు
- చిరువ్యాపారులతో తిప్పలు

మహానంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శ్రీశైలం తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగిన శైవ క్షేత్రం మహానంది. నిత్యం వేలాది మంది భక్తులతో మహానంది క్షేత్రం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇటు ఆదాయం లోనూ, అటు పర్యాటకుల రద్దీలోనూ మహానంది క్షేత్రం గ్రేడ్ వన్ టెంపుల్‌గా నిలిచింది. ఎంతో ఘన చరిత్ర కలిగిన మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు మాత్రం ఆశించిన స్థాయిలో సౌకర్యాలు కల్పించడం లేదు. మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు. ఎన్నో ఏళ్లుగా తిష్ట వేసిన వ్యాపారుల నుంచి



మహానందిలో భక్తులు సామగ్రి భద్రపరిచే గది

భక్తులు దగా పాలవుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అన్న ప్రసాదానికి నోచుకోక అష్ట కష్టాలు పడుతున్నారు. ఇదంతా తెలిసినా దేవదాయ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నాయి. ఈ మహాక్షేత్రానికి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచే కాక అనంతపురం, కడప, ప్రకాశం తదితర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. ఏడాదికి రూ.10 కోట్లకు పైగానే ఆదాయం ఉన్నా భక్తులకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

నల్లమల అడవికి అనుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో పరమశివుడు స్వయంభుగా వెలిశాడు. ఇక్కడ భక్తుల కోరికలు తీర్చే తల్లిగా కామేశ్వరీదేవి అమ్మవారు కొలువై ఉన్నారు. అంతా బాగానే ఉన్నా ఈ క్షేత్రానికి వచ్చే పర్యాటకులను వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. హోటళ్ల నిర్వాహకులు, చిరు వ్యాపారులతో పాటు కాంట్రాక్టు దక్కించుకున్న మరుగుదొడ్లు, టోల్ గేట్ నిర్వాహకుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టోల్‌గేట్ మొదలుకుని ఆలయ దర్శనం చేసుకుని బయటకు వచ్చే సరికి దోపిడీకి గురవుతున్నామని భక్తులు ఆరోపిస్తున్నారు. కోనేరులో స్నానం చేయాలన్నా బలవంతంగా లగేజీ బ్యాగులను కౌంటర్లలో పెట్టించి డబ్బులు వసూలు చేయడంపై భక్తులు ఆవేదనకు గురవుతున్నారు.

శనీశ్వర దర్శనంలోనూ...

మహానంది ఆలయంలో దోపిడీ ఎలా ఉందంటే చివరకు శనీశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్తే కూడా డబ్బులు ఇచ్చుకోవాల్సిందే. స్వామివారికి దీపాలు పెట్టాలంటూ బలవంతంగా దీపాలు అంటకట్టి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. సాధారణంగా మహానందీశ్వర స్వామిని, కామేశ్వరీ మాతను దర్శించుకున్న అనంతరం చివరగా శనీశ్వర స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. భక్తులకు ఇష్టం ఉన్నా లేకపోయినా కచ్చితంగా అక్కడకు వెళ్లేలా బారికేడ్లు పటిష్టంగా

మిగతా 6లో...

టెండర్‌దారుల దోపిడీ

మహానంది దేవస్థానం పరిధిలో మెజార్టీ నిర్వహణ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో టెండర్లు దక్కించుకున్న వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోంది. భక్తుల పాదరక్షలు భద్రపరిచే హక్కును మొదలుకుని టెంకాయల కౌంటర్, అభిషేక సామగ్రి, సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం, నవగ్రహాల వద్ద దీపాలను విక్రయించుకోవడం ఇలా ఒక్కటేమిటి అన్నిచోట్లా ఎండోమెంట్ అధికారులు టెండర్లు నిర్వహించి ప్రైవేట్ వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే వీరు అడిగినంత ఇవ్వాల్సిందే. లేకపోతే ఎలాంటి సామగ్రి అప్పగించకుండా యాత్రికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి దోపిడీని నియంత్రించాల్సిన అధికారులు చేతులు ఎత్తేయడంతో టెండర్‌దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



మహానందిలో టీటీడీ యాత్రికుల సముదాయ గృహం



ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయించే దుకాణం

కూటమి ప్రభుత్వ విజయాలకు ఏడాది

ఐదేళ్ల జగన్ అరాచక పాలన అంతమైన రోజు : మంత్రి బీసీ



బనగానపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఏడాది కింద జగన్ అరాచక పాలన అంతమైంది ఈ రోజే అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఘన విజయానికి ఏడాది అయిందని మంత్రి బీసీ తెలిపారు. అధికారం పేరుతో ఊరేగిన వైసీపీ ఉన్మాదాన్ని ప్రజలు ఎన్నికల్లో తరిమికొట్టింది ఇదే రోజని అన్నారు. పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమాలు, కమలనాధుల మద్దతుతో రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పునకు ఏడాది పూర్తయిన సందర్భంగా నాటి విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజలకు శిరస్సు వంచి నమస్కారాలు తెలియచేస్తున్నామన్నారు. వచ్చే నాలుగేళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని, బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధికి టీడీపీ కార్యకర్తలు, నాయకులు నిరంతరం పనిచేస్తారని అన్నారు.

గ్రీన్‌కో ఆగడాలను అరికట్టాలి



ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

పాణ్యం, జూన్ (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌కో ఆగడాలను అడ్డుకోవాలని పిన్నాపురం గ్రామ రైతులు ఆందోళన చేశారు. బుధవారం గ్రీన్‌కో సంస్థ చేపట్టిన సోలార్ పనులను సీపీఎం, ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో గ్రామ రైతులు అడ్డుకొని బైఠాయించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ గ్రీన్‌కో సంస్థ సోలార్ పనులతో రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులపై గ్రీన్‌కో సంస్థ యాజమాన్యం అక్రమ కేసులు బనాయించి భయపెడుతున్నదని అన్నారు. రైతుల పంట పొలాలకు వెళ్లే రస్తాలను ఆక్రమించి దౌర్జన్యానికి పాల్పడుతున్నదని అన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాము రైతు సంఘం నాయకులతో మాట్లాడి రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, వెంకటేశ్వరరావు, సురేష్, నరసింహనాయక్, కృష్ణ, నరసింహ, లక్ష్మణ్, బాలవెంకట్, సీఐటీయూ కార్యదర్శి భాస్కర్, సురేష్, కృష్ణ, ప్రసాదు పాల్గొన్నారు.

శ్రీశైలంలో హైకోర్టు న్యాయమూర్తి



ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుమతి జగడంకు స్వాగతం పలుకుతున్న పీఆర్వో

నంద్యాల కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం బుధవారం సందర్శించారు. శ్రీశైలంలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తికి ఆలయ ముఖ మండపం వద్ద శ్రీశైల దేవస్థానం పీఆర్వో శ్రీనివాసరావు స్వాగతం పలికారు.

'సూపర్ సిక్స్' అమలు ఎప్పుడు?

- ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి
- నంద్యాలలో 'వెన్నుపోటు దినం' ర్యాలీ

నంద్యాల నూనెపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇతర హామీలను ఎప్పుడు అమలు చేస్తారని కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జిల్లా వైసీపీ పరిశీలకురాలు కల్పలతారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వైసీపీ నాయకులు నంద్యాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లి నుంచి వైసీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ నిరసనలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంకోసం సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి అధికారం చేపట్టగానే వాటిని విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పిపినాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమీర్‌బాష, రామలింగారెడ్డి నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, అడ్వకేట్ ప్రతాపరెడ్డి, రసూల్‌ఆజాద్, అనిల్‌అమృత్‌రాజ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

డీఎస్సీ

- రేపటి నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 2645
- మొత్తం 73,605 దరఖాస్తులు
- 39,997 మంది అభ్యర్థులు
- 23,462 మహిళలు, 16,535 మంది పురుషులు
- పకడ్బందీ చర్యలు చేపట్టిన విద్యా శాఖాధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు మొత్తం 2645 ఉన్నాయి. ఇందులో ఎస్జీటీలు 1791 ఖాళీలు కాగా, స్కూల్ అసిస్టెంట్లు 854 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉపాధ్యాయ ఖాళీల పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39,997 మంది మెగా డీఎస్సీకి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కొక్క పోస్టుకు 15.11 మంది అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. వాస్తవానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెగా డీఎస్సీ కోసం 39,997 మంది అభ్యర్థులు 73605 దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కక్క అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఉపాధ్యాయ ఖాళీలు అత్యధికంగా ఉన్నాయి. దీర్ఘకాలికంగా డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో అభ్యర్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తూ నిరుత్సాహానికి గురయ్యారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో అత్యధికంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుండటంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లువిరిస్తుంది. ఈసారైనా ఉపాధ్యాయ పోస్టులను దక్కించుకునేందుకు ఆర్థికంగా భారమైనా, దీర్ఘకాలికంగా కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ఈసారి కూటమి ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యర్థుల కోసం ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి స్టయిఫండ్‌తో పాటు ఉచితంగా మెటీరియల్‌ను పంపిణీ చేసింది. ఇది నిరుద్యోగ ఉపాధ్యాయులను ఎంతో ఊరట ఇచ్చింది.



6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు..

ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈపరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శాఖాపరంగా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడు చేసుకుంటున్నారు.

హాల్‌టికెట్‌లో ఏమైనా సమస్యలుంటే కూడా సరి చేసుకునే వెసలుబాటును అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కల్పించారు. హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోయినా, ఐడీతో అనుమతి కల్పించారు. అయితే నామినల్ రోల్స్ తప్పులను పరీక్షా కేంద్రం వద్ద సరి చేసుకోవచ్చును. దృష్టి లోపం, చేతుల్లేని వారికి అదనంగా 50 నిమిషాల సమయాన్ని అదనంగా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'వెన్నుపోటు ర్యాలీ'కి కూలీలు



ర్యాలీలో పాల్గొన్న కర్నూలుకు చెందిన అడ్డా కూలీలు

నందికొట్కూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ చేపట్టిన వెన్నుపోటు ర్యాలీ కార్యక్రమంలో కర్నూలు నుంచి కూలీలను తరలించారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్, పొట్టిశ్రీరాములు సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈర్యాలీ కార్యక్రమంలో కర్నూలుకు చెందిన మహిళా కూలీలు దర్శనమిచ్చారు. ఎక్కడి నుంచి వచ్చారని మహిళల్ని ప్రశ్నిస్తే కర్నూలు చెన్నమ్మ సర్కిల్, సి.క్యాంప్ సెంటర్ల నుంచి తుఫాన్ వాహనాల్లో వచ్చామన్నారు. వైసీపీ నాయకుడు ఒకరు తమకు ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చారని మహిళలు పేర్కొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

వివరాలు 7లో



వైఎస్ వివేకాను వైఎస్ జగన్, వైఎస్ అవినాశ్ గొడ్డలితో నరుకుతున్నట్లు నిరసనలో ఓ సన్నివేశం

ప్రమాదంలో పర్యావరణం
నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం 6

మేనకోడలిపై అత్యాచారం 7

జాతీయ స్థాయి నాటక పోటీలకు రెండు నాటకాలు ఎంపిక 6

ప్రమాదంలో పర్యావరణం..!

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మానవుడి మనుగడకే గడ్డుకాలమే రాబోతోంది. మనుషుల వక్రబుద్ధి వల్ల తాము కూర్చున్న కొమ్మనే నరుక్కునే మూర్ఖుల్లా వ్యవహరిస్తూ ప్రకృతి విధ్వంసానికి కారకులవుతున్నారు. శాస్త్ర విజ్ఞానం వికసించే కొద్ది పర్యావరణ విధ్వంసం కూడా అదే స్థాయిలోనే పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం జ్ఞానవంతులందరూ ప్రకృతిని ప్రేమించి.. ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. దీని కోసం ప్రతిఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినం ప్రపంచ దేశాలన్నీ ఆనవాయితీగా నిర్వహిస్తున్నాయి. 2011 నుంచి మనదేశంలో ప్రతి ఏటా ఒక నినాదంతో ప్రపంచ పర్యావరణ దినాన్ని జరుపుతున్నారు. ఇందులో భాగంగా 2025 ఏడాదికి సంబంధించి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయండి (బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్) అనే నినాదాన్ని ఎంపిక చేశారు. నేడు ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- మానవుల స్వార్థానికి బలవుతున్న ప్రకృతి
- గాలి, నీరు, వాయు కాలుష్యాల ద్వారా వాతావరణ మార్పులు
- జాగ్రత్తలు లేకుంటే 2050కి భయానక పరిస్థితులు
- ఉమ్మడి జిల్లాలో 3355.02చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు
- ప్రకృతికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్
- నిషేధం విధించినా.. ఆచరణ శూన్యం
- కొరవడిన చైతన్యం.. నిద్రావస్థలో యంత్రాంగం



ఆత్మకూరు/ కర్నూలు న్యూసిటీ, జూన్4 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వివిధ రకాల కాలుష్యాలతో పర్యావరణం వినాశనానికి గురవుతూ వస్తోంది. ప్రత్యేకించి చెప్పాలంటే గాలి, నీరు, వాయు కాలుష్యాల ద్వారా వాతావరణ మార్పులు సంభవించి ప్రకృతి వనరులకు ఆటంకం కలుగుతోంది. మనిషి స్వార్థ తలంపులకు జీవనశైలిని అలవర్చుకునే కొద్ది పర్యావరణ విఘాతం జరుగుతూనే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో చెట్లు, చీమలతో పాటు అన్ని జీవులకు పెనుభూతంగా మారుతోంది. భూమిలో నీటినిల్వలు కనుమరుగయ్యేందుకు కూడా ప్లాస్టిక్ ప్రభావం ఉంటుంది. వివిధ రకాల కాలుష్యాల కారణంగా భూమికి రక్షణ వలయంగా ఉండే ఓజోన్ పొర నానాటికీ ఛిద్రమవుతూ మానవాళిని ముప్పును వాటిల్లిందుకు ప్రమాదంగా మారుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగి, జాగ్రత్తగా లేకుంటే 2050 నాటికి భయానక పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

పర్యావరణ విఘాతంతో ఆరోగ్య సమస్యలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ 105 రకాల వ్యాధులను గుర్తిస్తే.. అందులో 85 రకాల వ్యాధులు పర్యావరణ విఘాతంతోనే కలిగినవని నిర్ధారించారు. ఒక్క మనరాష్ట్రంలోనే 20శాతం రోగాలు పర్యావరణ వినాశంతోనే సంభవిస్తున్నారని గణాంక వివరాలు చెబుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు..

అవసరమైనంత వరకు వాయు, జల, శబ్దకాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంధనం, విద్యుత్ పొదుపు చేపట్టాలి. కాలుష్యం ఉత్పన్నమయ్యే వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. ఇంధనరహిత వాహనాలైన సైకిళ్లను ఉపయోగించాలి. చెట్లను పెంచతూ.. పచ్చదనం, పరిరక్షణకై ప్రజల్లో అవగాహన కల్పించాలి. అడవుల ప్రాధాన్యతను కూడా వివరించాలి. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన అంశాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రభుత్వం సైతం కాలుష్య కారకాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకోవాలి.

పర్యావరణానికి సూచిక పెద్దపులి



పర్యావరణ పిరమిడ్‌లో అగ్రభాగాన పెద్దపులిని సూచికగా అభివర్ణిస్తారు. పెద్దపులి మనుగడ సాగించే ప్రదేశాల్లో పర్యావరణం సమతౌల్యంగా ఉంటుందని నిపుణుల అంచనా. ఎక్కడైతే పెద్దపులి జీవనం సాగిస్తుందో ఆప్రదేశంలో పెద్దపులి ఆహారంగా తీసుకునే గడ్డితినే జంతువుల సంచారం అధికంగా ఉంటుంది. ఎక్కడైతే సమృద్ధిగా వర్షాలు కురిస్తాయో ఆ ప్రదేశంలో అడవులు వృద్ధి చెంది పచ్చికబయళ్లు పరుచుకుపోతాయి. సకాలంలో వర్షాలు కురియడంతో పర్యావరణం సమతౌల్యమై జీవుల మనుగడకు ఎలాంటి ఆటంకం కనిపించదు. ఈరకంగా పెద్దపులి జీవనచక్రాన్ని పరిగణలోకి తీసుకునే ప్రకృతి ప్రేమికులు పెద్దపులిని పర్యావరణ సూచికగా చెబుతారు.

నాడు ప్రశంసలు.. నేడు చేతులెత్తేశారు..

ఆరేళ్ల కిందట ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించి సత్ఫలితాలు సాధించారు. నాడు ప్లాస్టిక్ నిషేధాన్ని విజయవంతంగా అమలు చేసి ప్రశంసలు అందుకున్నారు. నేడు అధికార యంత్రాంగం మాత్రం చేతులెత్తేశారు. ఫలితంగా ప్లాస్టిక్ భూతం పంజా విసురుతోంది. కర్నూలులో పాతబస్తీ మొదలుకొని కొత్తబస్టాండ్ వరకు ప్రత్యేకంగా నిషేధిత ప్లాస్టిక్‌ను డంప్‌చేసి విక్రయాలు చేస్తున్నారంటే సిబ్బంది పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. నగరం నుంచి ప్రతినెలా రూ.60లక్షల వరకు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా.

20 మైక్రాన్ల కంటే తక్కువ మందం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను ఉత్పత్తి చేయడం, విక్రయించడం, వాడటం నేరం. ప్లాస్టిక్ సంచులను తయారు చేసే ఉత్పత్తి సంస్థల పేరు, చిరునామా, పరిమాణం తప్పని సరిగా ముద్రించాలి. నిబంధనలు ఉల్లంఘించిన ఉత్పత్తి సంస్థలకు జరిమానా విధిస్తారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వ్యాపారాలు మూడు పువ్వులు ముప్పై ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి.

ప్రజారోగ్యానికి హాని

పెట్రో రసాయనాల నుంచి నీటిని తయారు చేయడంతో వాటిలో ప్రజారోగ్యానికి హాని కలిగించే టాక్సిన్ అనే రసాయనం ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. నిషేధిత ప్లాస్టిక్‌కు నిప్పు పెడితే దాని నుంచి వెలువడే టాక్సిన్స్ పొగ వాయు కాలుష్యం కలిగిస్తోంది. పశువులు వీటిని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమై వాటి పాలు కలుషితమవుతున్నాయి.

బట్ట, కాగితం, నార సంచులు...

ప్లాస్టిక్ స్థానంలో బట్ట, కాగితం, నార సంచులు, వెదురు బుట్టలు వాడొచ్చు. విక్రయదారులు, వినియోగదారులపై భారీ జరిమానాలు నిర్బంధంగా అమలు చేయాలి. అప్పుడే ప్రజల్లో మార్పు వస్తుంది.

అందరూ భాగం కావాలి

మనిషి అవసరాన్ని మించి అడవులను నరికి వేస్తున్నారు. దీంతో పర్యావరణ వినాశం జరుగుతోంది. ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడి సూర్యుడి నుంచి వచ్చే ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలతో పెనుప్రమాదం పొంచి ఉంది. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

ఉమ్మడి జిల్లాలో 21శాతమే అడవుల విస్తీర్ణం

భూవిస్తీర్ణంలో 33శాతం అడవులు ఉంటేనే పర్యావరణం సమతౌల్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం 21శాతం మాత్రమే అడవుల విస్తీర్ణం ఉన్నట్లు అధికారి రికార్డుల ద్వారా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 17,658 చ.కి.మీల విస్తీర్ణం వుండగా అందులో 3355.02చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు విస్తరించాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా పర్యావరణ పరిరక్షణకు ప్రపంచదేశాలన్నీ కసరత్తు చేస్తున్నాయి.

కొరవడిన నియంత్రణ



పర్యావరణానికి పెనుభూతంగా పరిణమించిన ప్లాస్టిక్‌పై నియంత్రణ కొరవడింది. యథేచ్ఛగా విక్రయాలు విచ్చలవిడిగా వినియోగం సాగుతోంది. నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది కనుసన్నల్లో విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు అడపాదడపా తనిఖీలతో హడావిడి చేస్తున్నారే తప్ప ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాలకే ముప్పు



ప్లాస్టిక్ వాడకంతో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. మనం తీసుకునే ఆహారంలో మైక్రోప్లాస్టిక్ ఉద్గారాలు చేసి అనారోగ్యాలకు దారితీస్తున్నాయి. ఈకారణంగానే చిన్నవయస్సులోనే వివిధ రకాల జబ్బుల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

- పద్మావతిబాయి, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు

అప్పుడప్పుడు దాడులు చేసి..



నిషేధిత ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు అధికారులు అప్పుడప్పుడు దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు దాడులు చేసిన వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధులు ఫోన్ చేసిన మావాళ్లవే వదిలేయండని ఆదేశాలు జారీచేస్తున్నారు. ప్రస్తుతానికి నగరాల్లో ఎక్కువ శాతం ప్లాస్టిక్‌వైపే మొగ్గు చూపుతున్నారు.

ఎం.శ్రీహర్ష, కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు



దాడులు చేస్తూనే ఉన్నాం



నగరంలో ప్లాస్టిక్‌పై నిత్యం దాడులు చేస్తూనే ఉన్నాం. నగరపాలక సంస్థ పరిధి కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాస్టిక్ గోడౌన్లను ఏర్పాటుచేసి రాత్రి సమయాల్లో నగరంలో విక్రయిస్తున్నారు. కాలుష్య నియంత్రణమండలి శాఖతో సంయుక్తంగా దాడులు చేస్తున్నాం.

- కే.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్‌ఆఫీసర్, నగరపాలక సంస్థ, కర్నూలు

జాతీయ స్థాయి పోటీలకు రెండు నాటకాలు ఎంపిక



జగదేకసుందరి సామా నాటకంలో ఒక దృశ్యం (ఫైల్)

కర్నూలు కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ థియేటర్ వారు ఈఏడాది సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పౌరాణిక, చారిత్రక పద్య నాటక పోటీలకు కర్నూలుకు చెందిన రెండు నాటకాలు ఎంపికైనట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బీఎస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 19 నుంచి 27వరకు ఈజాతీయస్థాయి నాటక పోటీలు తిరుపతిలోని మహతి కళాక్షేత్ర ంలో తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నారు. విజేతలకు 'హనుమ అవార్డు'తో పాటు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

టీజీవీ కళాక్షేత్రం కళాకారుల 'జగదేకసుందరి సామా'

నగరంలోని టీజీవీ కళాక్షేత్రం కళాకారుల 'జగదేకసుందరి సామా' నాటకం జాతీయ పోటీలకు ఎంపికైనట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం అభినయ సంస్థ నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. ఈ నాటక పోటీల్లో తమ నాటకం జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు మహతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తామన్నారు. ఈ నాటకానికి ప ద్య రచన, దర్శకత్వం పత్తి ఓబులయ్య నిర్వహిస్తున్నారు.

టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారుల 'శ్రీ వేంకటేశ్వర మహాత్యం'

నగరంలోని టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారుల 'శ్రీవేంకటేశ్వర మహాత్యం' పౌరాణిక పద్య నాటకం జాతీయ పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈనాటకం జూలై 26న సాయంత్రం 6 గంటలకు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు. శారదా ప్రసన్న రాసిన ఈ నాటకానికి వీవీ రమణారెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి జాతీయ పోటీలకు ఎంపికైన సందర్భంగా రెండు నాటకాల దర్శకులను, కళాకారులను జిల్లాలోని వివిధ కళాసంస్థల ప్రతినిధులు, నాటకాభి మానులు అభినందించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్




మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకోవాలని సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ అన్నారు. బుధవారం పినాక ఫౌండేషన్ బి.దస్తగిరి, ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 21 రోజుల కేరీర్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గత నెల 17 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ మాట్లాడుతూ యాదగిరి కృషి అభినందనీయమని తెలిపారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకుంటే అప్పుడే పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగావకాశాలు అందుకోగలుగుతారన్నారు. వార్తా పత్రికలు, ఎంప్లాయిమెంట్ న్యూస్ వంటి వాటిని చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన జిల్లా అధికారి సోమ శివారెడ్డి, న్యాయవాది బలరాం పాల్గొన్నారు.

8న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 8న జూనియర్ బాలబాలికలకు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. 2010-11 సంవత్సరంలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 5 ఫొటోలతో ఎంపికకు హాజరు కావాలని కార్యదర్శి తెలిపారు. వివరాల కోసం 9866211480 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వనదేవత క్షోభ



చిత్రకారుడు కోటేష్ తన చేతిపై చిత్రం వేస్తున్న దృశ్యం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చేతిపై ఆక్రాలిక్ పెయింటిగ్స్‌తో వనదేవత క్షోభ చిత్రాన్ని వేశారు. ఈచిత్రంలో ఒక మనిషి తన స్వార్థం కోసం చెట్టును నరకుతుండగా వనదేవత మదనపడుతూ ఓ మానవుడా చెట్లను నరకొద్దురా అని రెండు చేతులు జోడించి వేడుకున్నట్లు చిత్రీకరించారు. చెట్లు లేక కరువు తాండవించగా జంతువుల, మనుషుల కళేబరాలు, రాబందులు ఉన్నట్లు, నరికిన, ఎండిపోయిన చెట్లు ఇలా ప్రకృతి వికృతి అయినట్లు, పర్యావరణం బాగుండాలంటే చెట్లు, నీటిని కాపాడుకోవాలని చిత్రంలో చూపించారు.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

గ్లోబల్ డిజిటల్‌లో లీడర్‌గా భారత్

- బ్రిక్స్ సభలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



బ్రిక్స్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్ జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టితోనే భారత్ గ్లోబల్ డిజిటల్‌లో లీడర్‌గా నిలిచిందని నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి అన్నారు. బ్రెజిల్ దేశంలో బ్రెసిలియా నగరంలో జరుగుతున్న 11వ బ్రిక్స్ శిఖరాగ్రసభ పార్లమెంటరీ మహిళా ఫోరానికి ఆమె పాల్గొని నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడారు. సమ్మిళిత వృద్ధి స్థిరమైన అభివృద్ధి అంతర్ పార్లమెంటరీ సహకా రాన్ని ప్రోత్సహించడానికి బ్రిక్స్ భాగస్వామ్య దేశాల అధ్యక్ష అధికారులు పార్లమెంటరీ యన్లతో కలసిన ప్రతినిధుల బృందం సమావేశాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది ఎంతో మధుర జ్ఞాపకమని అన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డా. వైఎస్సార్ క్రీడా పాఠశాల కడపలో విద్యార్థుల ప్రవేశానికి ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. 4వ తరగతి విద్యార్థులకు వయో పరిమితి 8-10 సంవత్సరాలు, 1.4.2015 నుంచి 31.3.2017 మధ్య జన్మించిన వారై ఉండాలి. అలాగే 5వ తరగతికి 9 నుంచి 11 సంవత్సరాల మధ్య ఉండాలి. 1.4.2014నుంచి 31.3.2016 మధ్య జన్మించిన వారు అర్హులు అన్నారు. జనన ధృవీకరణ పత్రంతో ఎంపికకు హాజరు కావాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన అభ్యర్థులు రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపిస్తామన్నారు. ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీవో తెలిపారు. వివరాలకు క్రీడా శాఖ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

మహానంది కష్టాలు



టెండర్ ద్వారా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు



మరుగుదొడ్లలో లీక్ అవుతున్న కొళాయిలు

5వపేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. ఈ సమయంలో టెండర్‌దారులు భక్తులకు బలవంతంగా దీపాలు అంటకట్టి డబ్బు వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వసతి గృహాలతో అవస్థలు

ఏడాదికి రూ.కోట్లలో ఆదాయం ఉన్నా భక్తులకు సరైన వసతి గృహాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. మహానంది దేవస్థానం పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన 28 వసతి గదులు, నాగనంది సదనంలో 10 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో సామాన్య భక్తులు విశ్రాంతి తీసుకునే పరిస్థితి లేదు. ఏ గదిలో చూసిన తుప్పు పట్టిన తలుపులు, లీకేజీ అవుతున్న కొళాయిలు దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే భక్తులు మరోమాట మాట్లాడకుండా వెళ్లిపోతున్నారు. రూ.300 నుంచి రూ.400కు లభించే ఈ గదులు సరిగా లేకపోవడంతో భక్తులు సమీపంలోని ప్రైవేట్ లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులు కూడా దోచేస్తున్నారు. కొన్ని గంటల వ్యవధికే రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు.

భక్తులకు మెరుగైన సేవలు





మహానంది దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దేవస్థానం అధికారులు నిర్ణయించిన ధరల ప్రకారమే టెండర్‌దారులు భక్తుల నుంచి రుసుం వసూలు చేస్తున్నారు. ఎవరైనా టెండర్‌దారుడు నిబంధనలకు విరుద్ధంగా భక్తుల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి వసూళ్లపై యాత్రికులు తమ దృష్టికి తీసుకురావాలి. గతంలో ఇలాంటి సంఘటనలపై ఫిర్యాదులు వస్తే జరిమానాలు కూడా విధించాం. నేరుగా ఆలయ కార్యాలయంలో కానీ, ఆలయ పరిధిలో ఏర్పాటు చేసిన స్కానర్ ద్వారా అయినా భక్తులు ఫిర్యాదు చేయవచ్చు. భక్తుల కోసం నూతనంగా 55 వసతి గదులను రూ.10కోట్లతో నిర్మించేందుకు టెండర్ పిలిచాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. హోటళ్లు, చిరువ్యాపారులపై నిఘా ఉంచుతాం.

- నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఈవో, మహానంది క్షేత్రం

ప్రజలకు జగన్ రెడ్డి వెన్నుపోటు

- తల్లికి, చెల్లికి వెన్నుపోటు, బాబాయికి గొడ్డలిపోటు
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- చెన్నమ్మకూడలిలో టీడీపీ నిరసన

కల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనత మాజీ సీఎం జగన్‌రెడ్డిదేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం నగరంలోని చెన్నమ్మకూడలిలో కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ విషం చిమ్ముతున్న వైసీపీ తీరును ఖండిస్తూ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఆస్తి కోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు, సొంత బాబాయికి గొడ్డలి పోటు ఘనత కూడా జగన్‌రెడ్డిదేనని ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం లో విధ్వంస, అరాచక పాలనను తిరస్కరించి రాష్ట్రంలో కూటమికి తిరుగులేని మెజా రిటీని అందించారన్నారు. జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వైసీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని గౌరు స్పష్టం చేశారు. వైసీపీ తీరుకు నిరసనగా నగరంలోని చెన్నమ్మకూడలిలో టీడీపీ శేణులు ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్. వివేకానందరెడ్డి చిత్రపటాలతో వినూత్నంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్ధన్ రెడ్డి, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్వీ.రామకృష్ణ, పియూ.మాదన్న టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


వైఎస్ జగన్, అవినాశ్ మాస్కులు, గొడ్డళ్లతో టీడీపీ శ్రేణులు

మేనకోడలిపై అత్యాచారం

- అన్నం పెట్టాక అఘాయిత్యానికి పాల్పడిన వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాలిక తల్లిదండ్రులు

ఆదోని రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం దారుణం చోటు చేసుకుంది. మేనకోడలిపై అత్యాచారానికి ఒడిగట్టాడు ఓ దుర్మార్గపు మామ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ బాలిక ఇంటికెళ్లి తన భార్య ఊరికెళ్లింది అన్నం పెట్టమని అడిగాడు. ఆ బాలిక అన్నం పెట్టాక లోపలికి వెళ్లి తాగడానికి నీరు తేవాలని చెప్పాడు. బాలిక నీరు తేవడానికి లోపలికి వెళ్లాక తలుపులు వేసి ఆ బాలిక అరవకుండా నోట్లో బట్ట పెట్టి అత్యాచారం చేశాడు. ఇంతలో ఆ బాలిక తండ్రి ఇంటికి చేరుకుని తలుపులను తోశాడు. ఎంతకీ తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్క వారి సాయంతో తలపులను బద్దలు కొట్టి చూడగా అచేతనంగా పడి ఉన్న తన బిడ్డను చూసి, అర్ధనగ్నంగా ఉన్న ఆ కామాంధుడిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఆ కామాంధుడు బాలిక తండ్రిపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం బాలిక తల్లిదండ్రులు ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డీయస్పీ హేమలత, రూరల్ సీఐ సి.నల్లప్ప, ఎస్ఐ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని, నిందితుడిపై పోక్సో, రేప్ కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ తెలిపారు. అనంతరం బాలికను వైద్య పరీక్షల నిమిత్తం రాత్రి 11 గంటల సమయంలో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బావిలో పడి బాలుడి మృతి


ధనుష్ (ఫైల్)

దేవనకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లచెలిమల గ్రామంలో ఓ బాలుడు బావిలోపడి మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. వీరేష్, కమల దంపతులకు కుమారుడు ధనుష్(11), కుమార్తె ఉన్నారు. తండ్రి పత్తికొండలోని ఓదుకాణంలో పని చేస్తున్నాడు. తల్లితో పాటు ధనుష్ ఉదయం పొలానికి వెళ్లాడు. తల్లి పొలం పనుల్లో ఉండగా, బాలుడు ధనుష్ పక్క పొలంలోని పిల్లలతో కలిసి సమీపంలోని బావి దగ్గరికి వెళ్లారు. అయితే ధనుష్ అదుపుతప్పి బావిలో పడిపోయాడు. ఎంతసేపటికి బాలుడు కనిపించకపోవడంతో తల్లి చిన్నారులను విచారించగా వారు బావిలోకి దిగినట్లు తెలిపారు. చుట్టుపక్కల వారు బావిలో గాలించి మృత దేహాన్ని బయటకు తీశారు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


వెంకట్రాముడు(ఫైల్)

క్రిష్ణగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలంకొండ గ్రామానికి చెందిన కౌలు రైతు తిరుపతి వెంకట్రాముడు (64) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యు లు, పోలీసుల కథనమ మేరకు.. తన పొలం 15.6 ఎకరాలను ముగ్గురు కొడుకులకు పంచి ఇచ్చాడు. అనంతరం ఏడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు సాచేశాడు.. నష్టాలు వచ్చి 18లక్షలకు పైగా అప్పుల య్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక మంగళవారం రాత్రి ఇంటికి సమీపంలోని కళ్ళం దొడ్డిలో పురుగు మందు తాగాడు. గట్టిగా అరుస్తుంటంతో భార్య పద్మావతి కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు.

ఉరి వేసుకుని తాపీ మేస్త్రీ..


సంజీవులు(ఫైల్)

వెల్దుర్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక 15వ వార్డుకు చెందిన తాపీ మేస్త్రీ సంజీవులు(47) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. భార్య కుమారుడు మంగళవారం ఊరికి వెళ్లి బుధవారం సాయంత్రం వచ్చి చూడగా ఉరి వేసుకొని కనిపించాడు. భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉరి వేసుకుని మహిళ...

బండి ఆత్మకూరు జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో వరలక్ష్మి(45) అనే మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. వరలక్ష్మి గత 15 సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నది. ఇంట్లో ఫ్యాన్‌కు గతరాత్రి ఉరి వేసుకొని చనిపోయింది. ఉదయం తల్లిదండ్రులు గమనించారు. మృతురాలి తల్లిదండ్రులు రామిరెడ్డి, లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

పోలీసు శాఖకు అల్ట్రాటెక్ డ్రోన్ కెమెరాలు వితరణ

కొలిమిగుండ్ల/నంద్యాల టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలోని ప్రముఖ సిమెంట్ ఉత్పత్తి కంపెనీ అల్ట్రాటెక్ మరోసారి తన ఔదార్యాన్ని ప్రదర్శించింది. నేరాల అదుపునకు కీలకమైన డ్రోన్ కెమెరాలను నంద్యాల జిల్లా పోలీసు శాఖకు విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు రూ.7లక్షల విలువ చేసే 4 డ్రోన్ కెమెరాలను కార్యాలయంలో అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ట్రాఫిక్ జామ్ సమస్యలపై నిఘా ఉంచడం, ఈవ్ టీజింగ్, ధర్నాలు, ర్యాలీలు, తిరునాళ్ల సమయంలో నిఘాకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, అల్ట్రాటెక్ ప్రతినిధులు అంజన్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్లు ఇస్తున్న కంపెనీ ప్రతినిధులు

మహిళను కిడ్నాప్ చేసే యత్నం

- గ్రామస్థులు అడ్డుపడటంతో వెనుతిరిగిన కిడ్నాపర్లు

దొర్నిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్జునాపురం గ్రామా నికి చెందిన అయ్యపు రెడ్డి హేమలతను చిన్నకందుకూరు గ్రామానికి చెందిన నూక నరసింహారెడ్డి, మరి కొందరు కిడ్నాప్ యత్నం చేయగా అత్తామామలు, గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామా నికి చెందిన అయ్యపురెడ్డి హేమలత గత 15 ఏళ్ల క్రితం భర్త చనిపో వడంతో అత్తామామలు కొండారెడ్డి, తులశమ్మ వద్దనే పిల్లలతో జీవిస్తోంది. స్వగ్రామం చిన్నకందుకూరులో ఆమె తల్లిదండ్రుల ఆస్తి ఉంది. ఈ విషయంలో తలెత్తిన తగాదాను చిన్నకందుకూరు గ్రామానికి చెందిన నూక నరసింహారెడ్డి పంచాయితీ చేసి పరిష్కరించారు. అదే అదునుగా తీసుకొని నూక నరసింహారెడ్డి హేమలతను అసభ్యకరంగా మాట్లాడుతూ కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. బుధవారం నరసింహా రెడ్డి, మరి కొంత మంది అర్జునాపురం గ్రామంలోని హేమలత ఇంటికి కారులో వచ్చి ఆమెను బలవంతంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అత్తామామలు, మరిది శ్రీనివాసరెడ్డి అడ్డుపడ్డారు. దీంతో నూక నరసింహారెడ్డి కత్తితో బెదిరించాడు. హేమలత మామ కొండారెడ్డి అడ్డుకోగా ఆయన చేతికి గాయమైంది. ఈలోగా గ్రామస్థులు రావడంతో నిందితులు కారులో పరారయ్యారు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో హేమలత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

హోరాహోరీగా గుర్రపు బండి పోటీలు


పోటీల్లో పరిగెడుతున్న గుర్రపు బండి

మిడుతూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం గుర్రపు బండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈపోటీలను కాతా రామచంద్రారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో తొమ్మిది గుర్రపు బండ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి వీపనగండ్ల గ్రామానికి చెందిన బడే బాష గుర్రపు బండికి 30 తులాల వెండి, రెండో బహుమతి మిడుతూరుకి చెందిన ముర్తుజావలికి 25తులాల వెండి, మూడవ బహుమతి కోవెలకుంట్లకు చెందిన జ్యోతికి 20 తులాల వెండి అందజేశారు. అలాగే నాలుగో బహుమతి బళ్లారికి చెందిన బాబు 15 తులాల వెండి, ఐదో బహుమతి చాపిరేవులకు చెందిన షేక్ హుశేన్ బాషకి 10 తులాల వెండి, ఆరో బహుమతి బనగానపల్లెకు చెందిన ఖాజకి 5తులాల వెండిని నిర్వాహకులు ఇచ్చారు.

మహిళలను ఆదుకునేలా చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళలను ఆదుకునేలా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం అమలు చేస్తున్న వన్‌స్టాప్, మహిళా హెల్ప్‌లైన్, నారీ అదాలత్, శక్తి సదన్ తదితర కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళలను ఆదుకునేలా జిల్లా హెడ్ క్వార్టర్‌లోనే కాకుండా డివిజనల్, మండల హెడ్ క్వార్టర్‌లో ఈ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఇందుకోసం అంగన్‌వాడీ వర్కర్ల సేవలతో పాటు మహిళా పోలీసుల సేవలను కూడా వినియోగించుకోవాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ వన్‌స్టాఫ్ సెంటర్ ద్వారా సర్వీసులకు సంబంధించి రిజిస్టర్‌లు కచ్చితంగా మెయింటైన్ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పరిహారం కేసులను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఎంహెచ్‌వో డా.శాంతికళ, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి


అధికారులతో సమీక్షిస్తున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మానవ మనుగ డకు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉం దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. బుధవారం స్థానిక న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ప్రతిఒక్కరూ పర్యావరణంపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలన్నారు. భూమి, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులతో చర్చించారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. మొక్కలను నాటి వాటిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, డీఎంహెచ్‌వో శాంతికళ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, కర్నూలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పంటి వైద్యం

నంద్యాల హాస్పిటల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఓ వైద్యుడి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఓ వ్యక్తి పంటి నొప్పికి వైద్యం చేయించు కోడానికి వెళ్లాడు. చికిత్స వికటించి చనిపోయాడు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న ఎంఆర్ హాస్పిటల్‌లో డా. మాదన్న 3వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి నంద్యాల పట్టణంలోని జాబిద్ హోటల్స్ యజమాని జాకీర్ పంటినొప్పి చికిత్స కోసం వెళ్లాడు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మరుసటి రోజు రమ్మని డాక్టర్లు చెప్పారు. బుధవారం హాస్పిటల్‌కు వెళ్లిన జాకీర్‌కు వైద్యుడు పన్ను తీసేందుకు అనస్థీషియా ఇంజక్షన్ ఇచ్చినట్లు సమాచారం. తర్వాత ఆకస్మాత్తుగా జాకీర్ కుప్పకూ లాడు. హాస్పిటల్ సిబ్బంది హుటాహుటిన పట్టణంలోని ఎన్ఐటీసీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జాబిద్ హోటల్స్ యజమాని మరణించడంతో హోటల్స్ సిబ్బంది, బంధువులు ఎంఆర్ హాస్పిటల్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మృతుడి కూతురు ఎంఆర్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపులు దగ్ధం


బేకరీలో చెలరేగుతున్న మంటలు

ఓర్వకల్లు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు షాపులు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.18 లక్షల నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఓర్వకల్లు గ్రామానికి చెందిన సునీల్‌కు సంబంధించిన బేకరి షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. అందులో ఉన్న నాలుగు ఫ్రిజ్‌లు, జిరాక్స్ మిషన్, మరో కంప్యూటర్‌తో పాటు పలు సామగ్రి బూడిదయ్యాయి. రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది. అలాగే మంటలు పక్కనున్న శేషఫణి ఎలక్ట్రికల్ షాపునకు వ్యాపించాయి. ఆ షాపులో ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోగా సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. మంటలను ఆర్పేందుకు ఫైరింజన్ వచ్చినా ఫలితం లేకుండా పోయింది. బేకరిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ పేలింది. స్థానికులు పోలీసులకు, ఫైరింజన్ సిబ్బందికి సమాచార మిచ్చారు. ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్‌కు బాధితులు వినతిపత్రం సమర్పించారు.

సారా విక్రేతలకు జరిమానా

వెల్దుర్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులకు జరిమానా విధించినట్లు కోడు మూరు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఎక్సైజ్ డీసీ శ్రీదేవి, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆదేశాల బుధవారం దాడులు నిర్వహించామన్నారు. మండలంలోని ఎల్.బండ గ్రామానికి చెందిన అయ్యస్వామి, వెల్దుర్తికి చెందిన సుంకులమ్మ, చిట్టెమ్మ, మద్దమ్మ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ముందు హాజరుపరిచారు. తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధించారని సీఐ అన్నారు. ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

వైద్య శాఖ బదిలీలపై స్పష్టత

- కమిషనర్ జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో సాధారణ బదిలీలపై కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులతో బుధవారం మధ్యాహ్నం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ, కార్యాలయ ఏవో కే.అరుణ పాల్గొన్నారు.

- 3 నుంచి 9 ఏళ్లలోపు జిల్లా కేంద్రంలో పని చేస్తున్న గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘం ఆఫీస్ బ్యారర్ల (మినిస్టీరియల్)లను లోకల్ స్టేషన్‌కు బదిలీ చేయాలి. ఒకవేళ కోరిన స్టేషన్ లేకపోతే కోరిన స్థానాన్ని ఇవ్వాలి.
- గుర్తింపు పొందిన ఆఫీస్ బ్యారర్ల ఉన్న మినిస్టీరియల్ స్టాఫ్ 3 నుంచి 9 సంవత్సరాలు దాటితే బయటి స్టేషన్‌కు వెళ్లాలి.
- ఐదేళ్లు దాటిన మినిస్టీరియల్ స్టాఫ్, పారా మెడికల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఇతర ఉద్యోగులు ఖచ్చితంగా బదిలీ కావాలి.
- ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) బదిలీలకు సంబంధించి ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ మార్గదర్శకాలు విడుదల చేశారు. ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీ చేయాలి. 2025 మే 31 నాటికి రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారు మాత్రమే అభ్యర్థన బదిలీలకు అర్హులు.
- బదిలీ కోరుతున్న ఉద్యోగులు ఐదు ప్రాధాన్యత స్థలాలు ఇవ్వాలి. ఒక స్థలానికి ఎక్కువ మంది కోరితే స్టేషన్ సీనియారిటీ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి. ఎవరైనా ఎంపిక చేయకపోతే ఖాళీల ఆధారంగా పోస్టింగ్ ఇవ్వాలి. ప్రతి గ్రామీణ ఆరోగ్య కేంద్రం, హెడ్ క్వార్టర్ సబ్ సెంటర్‌లో కనీసం ఒక ఎంపీహెచ్‌ఏ (ఫీమేల్) ఉండేలా చూడాలి.


జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో

బదిలీలపై గందరగోళం..

వైద్యఆరోగ్య శాఖలో వివిధ క్యాడర్లలోని వైద్యులు, పారామెడికల్, ఇతర విభాగాల ఉద్యోగుల బదిలీలపై గత నెల 31వ తేదీ అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నెల 5వ తేదీ బదిలీల దరఖాస్తులకు చివరి తేదీగా ఉంది. కానీ నేటి వరకు ఆర్‌డీ అధికారులు క్లియర్ వెకెన్సీ వివరాలు పంపించారు. కానీ లాంగ్ స్టాండింగ వెకెన్సీ ఉద్యోగుల వివరాలు ఇంకా ప్రకటించలేదు. దీంతో బదిలీలు కోరుకునే లాంగ్ స్టాండింగ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నోటీసు బోర్డులో కూడా ఎలాంటి సమాచారం లేకపోవడం విశేషం. కొత్తగా బదిలీల షెడ్యూల్, రివైజ్డ్ లాంగ్ స్టాండింగ్, క్లియర్ వెకెన్సీ లిస్టు విడుదల చేసి దరఖాస్తుల తేదీ, గ్రీవెన్స్ తేదీని ప్రకటించాలని ఉద్యోగులు కోరుతున్నారు. అయితే గుర్తింపు పొందిన ఉద్యోగ లెటర్ ప్యాడ్‌పై ఉన్న శ్రద్ధ బదిలీ మార్గదర్శకాలు, అధికారులు అలసత్వం బదిలీల అపోహలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు.







హామీల అమలులో ప్రభుత్వం విఫలం: వైసీపీ



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

ఆత్మకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆరోపించారు. కూటమి పార్టీలు విజయం సాధించిన జూన్ 4వ తేదిని వెన్నుపోటు దినంగా అభివర్ణిస్తూ ఆపార్టీ అధిష్ఠానం మేరకు ఆత్మకూరులో నిరసన చేపట్టారు. ముందుగా స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి వైసీపీ శ్రేణులతో కలిసి గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు గౌడ్‌సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలను గుప్పించిన కూటమి పాలకులు నేడు అధికారంలోకి వచ్చాక విస్మరించడం సిగ్గుచేటని అన్నారు. ప్రత్యేకించి సూపర్ సిక్స్ హామీలను ప్రకటించి ఇప్పటివరకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయచేయలేదన్నారు. కక్షరాజకీయాలు తప్ప ఎలాంటి పాలన చేయడం లేదని అన్నారు. ఇకపోతే శ్రీశైల నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మోమిన్ అహ్మద్‌హుసేన్, సయ్యద్‌మీర్, అంజాద్‌అలి, మారుబోతుల విజయ్‌కుమార్, మునీర్ తదితరులు ఉన్నారు.



నందికొట్కూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ బుధవారం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సుధీర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలవుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో కక్షపూరిత రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా శూన్యం అని, ఎండగట్టేందుకు వెన్నుపోటు దినంగా నిరసన ర్యాలీ చేపట్టామని చెప్పారు. జడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోముల సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర రెడ్డి, కౌన్సిలర్ నాయబ్, వైసీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మన్సూర్ అహ్మద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలపై భారం వద్దు: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

ఆత్మకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం కన్నా బాదుడే ఎక్కువగా ఉందని, ప్రజలపై భారం వద్దని సీపీఎం నాయ కులు రణధీర్, సురేంద్ర సూచించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనతో పోల్చితే కూటమి పాలనలో ప్రజలపై అధిక భారాలు పడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి ప్రజలపై భారాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నాయకులు కిరణ్, శివకుమార్, నూర్‌అహ్మద్, హుస్సేన్‌బాషా, ఉసేనాలం, శేషయ్య, అబ్దుల్ రజాక్ ఉన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ హోదా మార్పుపై హర్షం



డీఎంహెచ్‌వోకు జ్ఞాపికను అందజేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు

నంద్యాల హాస్పిటల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేయడంపై జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎం నెంబరు 64ను ఈ నెల 3న జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జోనల్ స్థాయిలో హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టులను గతంలో మంజూరు చేసిందని సుదీర్ఘ పోరాటంలో భాగంగా ప్రభుత్వం హోదాను మార్చడంతో సంతోషం వ్యక్తం చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ల దీర్ఘకాలిక కోరిక, ఆశయం నెరవేరడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, మల్లికార్జున, డిప్యూటీ డెమో రవీంద్రనాయక్ బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణను సన్మానించి జీవో ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సరోజ, సరస్వతి, ప్రతిభ పాల్గొన్నారు.

కొక్కెరంచలో కార్డన్ సెర్చ్

కొత్తపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొక్కెరంచ గ్రామంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కొత్తపల్లి, పాములపాడు ఎస్‌ఐలు జయశేఖర్, సురేష్ తమ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పురవీధుల గుండా కలియతిరుగుతూ అనుమానం ఉన్న ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలిలో గ్రామస్థులతో సీఐ మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నాటుసారా, మద్యం విక్రయాలు జరిపినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

63 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొక్కెరంచ గ్రామంలో 63 మద్యం క్వాటర్ బాటిళ్లు పట్టుబడినట్లు కొత్తపల్లి ఎస్‌ఐ జయశేఖర్ తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులుగౌడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అందులో భాగంగా తమ సిబ్బందితో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి 63 మంది క్వాటర్ బాటిల్స్ చేసుకుని సదురు వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



జూపాడుబంగ్లాలో యోగాపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్

జూపాడుబంగ్లా, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగాసనాలు వేయడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మాస్టర్ ట్రైనర్ విజయభాస్కరరెడ్డి, చిన్నమద్దిలేటి అన్నారు. జూపాడుబంగ్లాలోని ఆదర్శ పాఠశాలలో యోగాంధ్రపై బుధవారం శిక్షణ ఇచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు యోగా ఆసనాలపై శిక్షణ ఇచ్చారు.

పాములపాడు: యోగాంధ్ర డే లో భాగంగా మండల అధికారులు యోగాలో పాల్గొని ఆసనాలు వేశారు. పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తహసీల్దార్ సుభద్రమ్మతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు. వ్యాయమ ఉపాధ్యాయులు వివిధ రకాల ఆసనాలను తెలియచేస్తూ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని, ఆరోగ్యంగా ప్రశాంతంగా ఉండొచ్చని సూచించారు.

'యువగళం' పుస్తకం అందజేత



పుస్తకాన్ని మంత్రి ఫరూక్‌కు అందజేస్తున్న మంత్రి లోకేశ్

నంద్యాల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు పాదయాత్ర విశేషాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు అందజేశారు. బుధవారం అమరావతిలో ఈ పుస్తకాన్ని అందజేశారు. పాదయాత్ర విశేషాలను కూడా మంత్రితో ఆయన పంచుకున్నారు.

వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- రాక్షస పాలన అంతం.. సుపరిపాలన ప్రారంభమై ఏడాది
- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య
- సంబరాలు చేసుకున్న టీడీపీ, జనసేన నాయకులు



అల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెన్ను పోటు రాజకీయాలు చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. అల్లూరు గ్రామంలో బుధవారం మాండ్ర శివానందరెడ్డి నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల రూపాయలు దోచుకొని అదే పార్టీకి వెన్ను పోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించలేదా? అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్న కూటమి ప్రభు త్వంపై వెన్ను పోటు దినోత్సవం అంటూ కార్యక్రమాలు చేయడం సిగ్గు చేటన్నారు. తల్లికి, చెల్లికి, అనుబంధాలకు రక్త సంబంధాలకు వెన్ను పోటు పొడిచింది ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు. వైసీపీ డ్రామాలను ప్రజలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, ఖలీలుల్లా బేగ్, పలుచాని మహేశ్వరెడ్డి, అల్లూరు సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వ పరిపాలనతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని జనసేన పార్టీ నాయకులు ధూపం అభిమన్యుడు, కర్నాటి శ్రీరాములు అన్నారు. సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని తోటగేరిలోని చౌడేశ్వరీ కల్యాణ మంటపంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో సుపరిపాలన ఉందని అన్నారు. వైసీపీ నేతలు జూన్ 4న వెన్నుపోటు దినం పేరిట ర్యాలీలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరు, ఎవరికి వెన్నుపోటు పొడిచారో ప్రజలకు తెలుసని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. నాయకులు అరుణ్, హరీష్, సుబ్బు, ఖాజా, శ్యామ్, వీర మహిళలు సుకన్య, ప్రవళిక, సరస్వతీ తదితరులు ఉన్నారు.



ఆత్మకూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ: రాష్ట్రంలో రాక్షస పాలన ముగిసి ఏడాది గడిచి సుపరిపాలన మొదలైందని స్థానిక జనసేన నాయకుడు రాచమడుగు చందు అన్నారు. జనసేన అధినేత రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు నంద్యాల జనసేన కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. చందు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి తెనాలివెళ్లి రౌడీలకు మద్దతు పలకడం ఆయన దిగుజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. వీర మహిళలు ముగ్గులు వేసి రంగవల్లులను తీర్చిదిద్దారు. నాయకులు సంజీవ రాయుడు, రాంబాబు, వీరమహిళలు లక్ష్మీదేవి, జ్యోతి, మల్లేశ్వరి, రమాదేవి, జన సైనికులు శివశేఖర్, రాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ రాష్ట్రంలో రాక్షస పాలన అంతరించి సుపరిపాలను ఏర్పడి ఏడాది కాలం అయిందని అయ్యలూరు టీడీపీ నాయకురాలు బైరెడ్డి శంకరమ్మ అన్నారు. పట్టణ సమీపంలోని సాయి ఈశ్వర్ నగర్‌లోని ఆమె నివాసంలో కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.



అయ్యలూరులో స్వీట్స్ పంపిణీ చేస్తున్న నాయకురాలు శంకరమ్మ

పాములపాడు: రాష్ట్రంలో రాక్షస పాలన అంతమై ఏడాది పూర్తయిందని జనసేన నాయకుడు రాము ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బుధవారం పాములపాడులో మహిళలు సంక్రాంతిని తలపించేల రంగవల్లులు తీర్చిదిద్ది సంబరాలు నిర్వహించారు. జన సైనికులు సూర్యబాబు శేఖర్, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, సత్య, బాషా, రాహులు, శివ, భరత్, వెంకటేశ్, ఆనంద్ విష్ణు, గణేశ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో రంగవల్లులు వేసిన వీరమహిళలు

ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నంద్యాల హాస్పిటల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించి విధులకు హాజరై పరీక్షలన్నీ నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలోని జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో బుధవారం జరిగిన జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల నెలవారి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా ఎలిమినేషన్ స్టేజిలో ఉన్నామని, నిర్దేశించిన లక్ష్యాలను ప్రతినెలా పూర్తి చేయాలని ఆదేశించారు. ల్యాబ్‌కు అవసరమైన అన్ని రసాయనాలు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన వాటికోసం తన దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల నుంచి ప్రతిరోజు నిర్వహించే రక్తపరీక్షలన్నీ ఐహెచ్‌ఐపీవీడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నెలవారి సమర్పించాల్సిన నివేదికలను, ల్యాబ్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి శారదాబాయి, సహాయ మలేరియా అధికారి రామవిజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో బుధవారం ఉదయం సాక్షి గణపతికి అర్చకులు దేవస్థానం సేవగా విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచామృతాలతో, పలుఫలోదకాలతో, హరిద్రోదకం,గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పుష్పార్చన, నివేదన తదితర కార్యక్రమాలు జరిపించారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామికి..

శ్రీశైలం క్షేత్రంలో బుధవారం ప్రదోషకాలంలో ఆలయ ప్రాంగణంలో వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీరభద్రస్వామికి పంచామృతాలు, పలురకాల ఫలోదకాలు, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతో , మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా స్వామివారికి పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణంపై హరికథ

నంద్యాల కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాయంకాలం నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా కడప యడవల్లి శ్రీనివాస్ భాగవతార్ చే శివపార్వతుల కల్యాణంపై హరికథ గానం నిర్వహించారు. తబల పవన్‌కుమార్, హార్మోనియం శ్రీనివాసరావు సహకారాన్ని అందించారు. అనంతరం హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్ర మాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం



క్షయవ్యాధి లక్షణాల గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

ఆత్మకూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని టీబీ సూపర్ వైజర్ రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కృష్ణాపురం గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ సూపర్ వైజర్ రవికుమార్ మాట్లాడుతూ.. క్షయ చికిత్స తీసుకోకుండా తప్పిపోయిన వారిని గుర్తించి చికిత్స అందించడం, క్షయవ్యాధి మరణా లను తగ్గించడం, క్షయ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం, పోషకాహార ప్రాముఖ్యతను వివరించడం టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వ్యాధినిర్ధారణ అయితే అక్కడి వైద్యశాలలోనే ప్రభుత్వం వ్యాధికి సంబంధించిన మందులు 6 నెలల పాటు ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే నెలకు రూ 500 చొప్పున పోషకాహారం తీసుకునేందుకు ప్రభుత్వమే రోగి ఖాతాకు జమ చేస్తుందని వెల్లడించారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి పీహెచ్‌సీలలో వైద్యసేవలను అందిస్తామన్నారు. అందరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది రవి,ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హోమాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

మిడుతూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండో రోజు బుధవారం గురుపూజ్యులు జూలకంటి మల్లికార్జున శర్మ, కాతా రామచంద్రారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద పండితులు గిరిధర్ శర్మ, భరద్వాజ కుమారశర్మ సమక్షంలో కాతా పక్కీరెడ్డి, రామనాగేశ్వర రెడ్డి, శివకిరణ్ యాదవ్, కాతా కార్తీకేయ రెడ్డి, అభిషేక్ రెడ్డి దంపతులు దీక్షాహోమం ఆవాహిత దేవతా హోమం, మన్యుసూక్త, పురుష సూక్త, శ్రీరామ నామ తారక మంత్ర హోమం, మహాస్నపనం, ఆంజనేయ స్వామికి పీఠ ప్రతిష్ఠ మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ప్రదోశ పూజ, దీక్షా హోమం, అధివాస హోమాలు ధాన్యాధివాసాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో సేవా కమిటీ నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర' ఏర్పాట్ల పరిశీలన

మహానంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 న మహానంది క్షేత్రంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆలయం ప్రాంగణంలోని పరిసరాలను పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆలయ పారిశుధ్య సిబ్బందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ కోసం శుభ్రం చేయించారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచుతామన్నారు. మహానందిలో జరిగే యోగాంధ్రకు కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఈవో తెలిపారు.

మొక్కలు నాటాలి

గడివేముల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రతి పంచాయతీకి 200 మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటుకునేలా ప్రజలను చైతన్యం తేవాలని సూచించారు.

9న బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రూములు, భూములను మూడేళ్ల కౌలుకు ఇవ్వడానికి ఈనెల 9వ తేదీన ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. దేవస్థానానికి చెందిన సర్వే నెంబరు 17లో 2.92 ఎకరాలు, సర్వే నెంబరు 46లో 1.46 ఎకరాలు, సర్వే నెంబరు 2064లో 44 సెంట్లు, సర్వే నెంబరు 480లో 4.87 ఎకరాలు, సర్వే నెంబరు 888-3లో 10సెంట్లు కౌలుకు బహిరంగ కౌలుకు వేలం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారు మరిన్ని వివరాలకు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా మండలి ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ విధానంలో ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా, ఎంఆర్.నాయక్‌లు మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ గత రెండేళ్లుగా అమలవుతోందని, ప్రారంభం నుంచి చదివే చదువుకు చేసే ఇంటర్న్‌షిప్‌నకు సంబంధమే లేకుండా పోయిందన్నారు. విద్యార్థులను ఇంటర్న్‌షిప్ పేరుతో వివిధ పరిశ్రమల్లో పనిచేయించడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ విధానంలో మూడేళ్లలో 10 నెలలపాటు ఇంటర్న్‌షిప్ ఇవ్వడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్రమైన ప్రభావం పడుతోందన్నారు. రెండు, నాలెగొ సెమిస్టర్‌లలో సరాసరి 8 వారాలు ఇంటర్న్‌షిప్‌ను కేటాయించడం సరికాదన్నారు. విద్యార్థుల చదువుకు తగ్గట్టు ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఆ సమయంలో వారికి తగిన స్టైఫండ్ ఇచ్చేవిధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలన్నారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

మహానంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై సూర్యఘర్ పథకం ద్వారా గృహాలకు సోలార్ రూఫ్ టాప్‌ను అందజేస్తోందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బొల్లవరం, తమ్మడపల్లి, బుక్కాపురం గ్రామాల్లో బుధవారం విద్యుత్ వినియోగదారులతో సూర్యఘర్‌పై ఏఈ అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రూ.75 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు సబ్సిడీ రూపంలో అందజేస్తోందన్నారు.

ఆధ్యాత్మిక భావన పెంచుకోవాలి



పూజలు నిర్వహించి వస్తున్న జగద్గురు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన పెంచుకోవాలని జగద్గురు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కర్నూలులోని సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ నిర్వాహకులు, ఆధ్యాత్మిక గురువు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణకుమారి దంపతులు బుధవారం మహానందిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం వద్ద పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు వేద పండితులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ శివశంకర్ చౌదరి, నాగపుల్లయ్య, హరిబాబుచౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



గడివేములలో బహుమతి అందజేస్తున్న ఎంపీడీవో

గడివేముల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం ఆయన వంట ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం, అందించాలని ఎంఈవోలు చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు సూచించారు. జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వంట నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ అందించారు. ఆహార భద్రత, సమతుల్య పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాముఖ్యం గురించి వివరించారు. రుచికరమైన భోజనాలు ఎలా సిద్ధం చేయాలో సూచించారు.

ప్రతి రైతు శాస్త్రవేత్తగా ఎదగాలి


మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్

చాగలమర్రి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రైతు ఒక శాస్త్రవేత్త కావాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు రవిగౌడ్, వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని డి.వనిపెంట, చాగలమర్రి గ్రామంలో ఏవో రంగనేతాజీ ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు కేవలం వ్యవసాయం మాత్రమే కాకుండా అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానం వంటి వాటిపై దృష్టి సారించి వ్యవసాయం వ్యాపరంగా మార్చుకొని అధిక ఆదాయం పొందాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదు: సర్పంచ్

గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి తనను ఆహ్వానించి ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారని సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణంలో నిర్వహించే ప్రతి కార్యక్రమం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహిస్తారన్నారు. అయితే సంబంధిత ఏవో రంగనేతాజీ ప్రొటోకాల్ పాటించకుండా తనను సామాన్య రైతుగా చూశారని సర్పంచ్ ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

రామ్‌కో రైతులకు న్యాయం చేయండి: సీపీఐ


మాట్లాడుతున్న రంగనాయుడు

కొలిమిగుండ్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ పరిశ్రమ బాధిత రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ప్రెసిడెంట్ రామ రాజు, ఇతర ప్రతినిధులతో సీపీఐ బృందం, రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపినట్లు సీపీఐ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, జిల్లా రైతు సంఘం ప్రతినిధి సోమన్న, స్థానిక రైతు సంఘం నాయకులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ


పశువుల దాణాను పంపిణీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ మారుతీ సకారం

అవుకు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణాను పంపిణీ చేసినట్లు పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు మారుతీ సకారం తెలిపారు. బుధవారం ఉదయం పశువైద్యశాల ఆవరణలో రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పోరేషన్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్, పశువైద్యాధికారి డాక్టర్ భారతీదేవితో కలసి రైతులకు దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తిక్కన్న, పశువైద్యశాల సిబ్బంది రాజేష్, ఎల్ఎస్ఏలు, పాడి రైతులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సంతాన వేణుగోపాల స్వామి

రుద్రవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువుదీరిన సంతాన వేణుగోపాల స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేణుగోపాలస్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మ వార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతాపారాయణం చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ట్రీగార్డ్స్ వితరణ

ఉయ్యాలవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు ఉన్నత పాఠశాలకు పది ట్రీగార్డ్లను ఉచితంగా అందించినట్లు పాఠశాల హెచ్ఎం షరీఫ్ బుధవారం తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ సభ్యులు ప్రసాద్, శేషఫణి, శ్రీనివాసరెడ్డి మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డ్సను అందించారన్నారు. వీరికి హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

మూడువేల మొక్కల పెంపకం లక్ష్యం

ఉయ్యాలవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో 3వేల మొక్కలు నాటి పర్యవేక్షించడమే తమ లక్ష్యమని ఎంపీడీవో ఉమా మహేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. బుధవారం ఉదయం 10గంటలకు స్థానిక ఉన్నత పాఠశాలల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ఫోటో: 4ఎఎల్‌జి03: ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన సమన్వయ కర్త మల్లయ్య

సుపరి పాలనకు ఏడాది

● పట్టణంలో జనసేన సంబరాలు


మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ఆళ్లగడ్డ జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరి పా లనకు ఏడాది అ యిందని జనసేన స మన్వయ కర్త మైలేరి మల్లయ్య తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆ వరణంలో రంగవల్లు లతో(ముగ్గులపోటీ లు) సంబరాలు నిర్వ హించారు. అలాగే మూడు రోడ్ల కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు తొలగిపోయి పండగ వాతావరణంలో ఏడాది పూర్తి చేసుకో వడం ఆనందంగా ఉందన్నారు. కల్తీ మద్యం, మైనింగ్, రౌడీజంతో విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య, దేవాంజనేయులు, బ్రహేంద్రకుమార్, గుర్రప్ప, నరేంద్రగౌడ్, జగదీష్, రామయ్య, సుధాకర్, చైతన్య, మదు, కంకర్, సుబ్బారెడ్డి, నాగేష్ , మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చల్లా మద్దిలేటి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సరుకులు

● కలెక్టర్ రాజకుమారి
● రేషన్ దుకాణం, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ


రేషన్ దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

శిరివెళ్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు ఇంటి వద్దనే నిత్యా వసర సరుకులు అందించాలని కలెక్టర్ రాజకుమారి డీలర్లను ఆదేశించారు. బుధవారం శిరివెళ్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేషన్ దుకాణం, తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతి ప్రభుత్వ చౌక దుకాణం వద్ద సమయాన్ని సూచించే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కాలం చెల్లిన మందులు పంపిణీ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల జరుగుతున్న ప్రసవాలు, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. కార్యా లయానికి వచ్చే ప్రజల అర్జీలను స్వీకరిస్తూ నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. వంట గ్యాస్ సిలిండర్ నిర్ణీత ధరకంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు కలెక్టర్ గుర్తించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని రేషన్ దుకాణాలను, గ్యాస్ ఏజెన్సీ లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కలె క్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పుష్పకుమారి, వైద్యులు ముఖేష్, ఆంజనే యులు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కుతో యువతకు ఉపాధి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
● ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ పార్కుతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జగదుర్తి గ్రామ సమీపంలో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుకు ఎమ్మెల్యే కోట్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రాంతీయ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించనుందన్నారు. ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం అనంతరం ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి కొత్త దిక్సూచి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ పూజలు


విగ్రహాల పూజలో పాల్గొన్న దంపతులు

సంజామల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముచ్చలపురి గ్రామంలో శివాలయంలో కొలువుదీరనున్న గణపతి, గౌరీ దేవి సుబ్రహ్మణేశ్వరస్వామి, రాములమ్మ విగ్రహాలతో పాటు పోతురాజు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజలు వైభవంగా నిర్వహించారు. బుధవారం వేద పండితులు సుధా చక్రవర్తి , వెంకట నరసింహ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, అభిషేకం, రుద్రహోమం, మంగళహారతి, భక్తులకు తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం స్వామి వారి ప్రతిష్ఠ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు అమీరు దొర పెద్దిరెడ్డి, చిన్న రాముడు, గ్రామస్థులు తెలిపారు.

ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వం

● జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
● వైసీపీ ఆధ్వర్యంలో నిరసన


బనగానపల్లెలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న వైసీపీనాయకులు

బనగానపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించి ప్రభుత్వం నట్టేట ముంచిందని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ నాయకలతో కలిసి తహసీల్దారు నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలను కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఏడాది పాలనలో సీఎం చంద్రబాబునాయుడు లక్షన్నర కోట్లకుపైగా అప్పు చేశారన్నారు. కార్యక్రమంలో కాటసాని తిరుపాల్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి, పోచాశీలారెడ్డి, శంకర్‌రెడ్డి, అత్తార్‌జాహీద్‌హుసేన్, అబ్దుల్‌ఖైర్, జనార్దన్‌రెడ్డి, సత్యాల్‌రెడ్డి, బనగానపల్లె, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు: మాజీ ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ : రాబోయో ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. పట్టణంలోని నాలుగురోడ్ల సర్కిల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ రాఘవేంద్రారెడ్డి, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



డోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

హామీల అమలులో కూటమి విఫలం

డోన్ టౌన్: అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని వైసీపీ పార్టీ కార్యాలయం నుంచి మాజీ మంత్రి బుగ్గన ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్లకార్డులు చేపట్టి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ యాదవ్, బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలంరెడ్డి, నాయకులు శ్రీరాములు, సోమేష్ యాదవ్, మల్లికార్జున రెడ్డి, జాకీర్ హుశేన్, మధన్, రామచంద్రుడు, పోస్టు ప్రసాద్, రమణ, అబ్దుల్లా, బుగ్గన జయ చంద్రా రెడ్డి, దొరపల్లె చిరంజీవి, సురేష్, ప్యాపిలి నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రద్ధ ఏదీ?

- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
- ఫొటోలకు ఫోజులు ఇస్తున్న అధికారులు
- నిండుకున్న మురుగు కాలువలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ


చాగలమర్రిలోని భూమానగర్‌లో నిలిచిన మురుగు

చాగలమర్రి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమం రోజు కూడా కేవలం అధికారులు ఆయా గ్రామాల్లో ఫొటోలకు ఫోజులు ఇచ్చి ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేసి వెళ్లడమే తప్పా క్షేత్రస్థాయిలో వారు చేసేది ఏమి లేదన్న విమర్శలు ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 11 మజరా గ్రామాలు ఉన్నాయి. 52 వేల మంది జనాభా ఉన్నారు. అయితే గ్రామాల్లో మురుగు కాలువలు కుండుకోవడంతో దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. మరో పక్క ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రతి నెల నిర్వహిస్తున్న డ్రైడే, ఫ్రైడే మండలంలో కాగితాలకే పరిమితమైంది. చాగలమర్రి మేజర్ పంచాయతీలో మురుగు కాలువలు, చెత్తా చెదారం పేరుకపోయి పలు వీధుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. భూమానగర్‌లో మురుగు నీరు నిలిచి కుంటగా మారింది. కాలనీ వాసులు ముక్కున వేలేసుకొని వెళ్లాల్సి వస్తోంది. పెద్దబోధనం ఎస్సీ కాలనీ, మద్దూరు, తోడెండ్లపల్లె, గొడిగనూరు, ముత్యాలపాడు, చింతల చెరువు తదితర గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. ఏదో మొక్కుబడిగా బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లి మమా అనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో డ్రైడే, ఫ్రైడే పూర్తిగా పడకేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి శ్రద్ధ తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారిలో పడేసిన చెత్తా చెదారం


చాగలమర్రిలో స్వైరవిహారం చేస్తున్న పందులు

● **పందుల స్వైరవిహారం**

చాగలమర్రిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగు కాలువల్లో తిరిగి రోడ్లపై సంచరిస్తుండటంతో ప్రజలు పలు రోగాలకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరో పక్క రహదారుల వెంట సంచరిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పందుల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చాగలమర్రి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మాకే నామ్ ఏక్‌పేడ్ అనే పేరుతో అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వనం-మనం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ప్రతి పంచాయతీలో 200 నుంచి 250 మొక్కలు నాటాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఎంసీవో రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కరెంట్ బిల్లులు

చాగలమర్రి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఈనెల నుంచి కరెంట్ బిల్లుల్లో ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ ఏఈ రమణయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న సూపరింటెండెంట్

ఆళ్లగడ్డ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సబ్ జైల్ సూపరింటెండెంట్ శల్వంత్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆళ్లగడ్డ ఐదవ అడిషనల్ జిల్లా న్యాయాధికారి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ సబ్ జైల్ లోని పలు ప్రాంతాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు విరివిగా నాటడం తోపాటు వాటి ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు షాహినా, మొహన్, వార్డన్ వెంకటసుబ్బన్న పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ జూన్ 4(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని టౌన్ సీఐ యుగంధర్ కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండగ రోజున ప్రశాంత వాతావరణంలో నమాజ్ చేసుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామాచారి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ తెలిపారు. బుధవారం రాత్రి చాగలమర్రి పోలీసు స్టేషన్ ఆవరణలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నబీసాహేబ్, హెచ్‌సీ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ఖాజీ యూనస్, టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, సల్లానాగరాజు పాల్గొన్నారు.

వెన్నుపోటు సంస్కృతి వైసీపీదే

● డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు సంస్కృతి వైసీపీదేనని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ విమర్శించారు. బుధవారం వెంగళాంపల్లిలో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్‌రెడ్డి కుటుంబ సభ్యులను వెన్నుపోటు పొడిచిన సంగతి ప్రజలందరికి తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. వైసీపీ పాలనలో ఎవరైతే అవినీతి, అక్రమాల కు పాల్పడినారో వారంతా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌యాదవ్, నాగేంద్ర, కోదండ రామయ్య, శంకర్, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

ప్యాపిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని భోజనం పథకం నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది మద్దయ్య, భువనేశ్వరి, రామాంజినేయులు, నవీన్ తదితులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.15.52 లక్షల ఆదాయం

శిరివెళ్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రూపు దేవస్థానం పరిధిలోని రెండు ఆలయాకు చెందిన భూములకు నిర్వహించిన బహిరంగ కౌలు వేలం ద్వారా రూ.15.52 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ బనగానపల్లె తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, సిబ్బంది మేరువ శివనాగిరెడ్డి, గ్రామ పెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

పర్మిట్లు లేని వాహనాలకు జరిమానా


బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టీఏ అధికారి క్రాంతి కుమార్

డోన్ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద పర్మిట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలకు ఆర్‌టీఏ అధికారులు భారీ జరిమానా విధించారు. బుధవారం ఆర్‌టీఏ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆర్‌టీఏ అధికారులు ఆలిండియా పర్మిట్ స్లీపర్ బస్సులను తనిఖీ చేసి రహదారి పన్ను చెల్లించకుండా ఉరువకొండ నుంచి హైదరాబాదు వెళ్తున్న ఫరీదా ట్రావెల్స్ ఏపీ39యూవై4570 బస్సుపై కేసు నమోదు చేసి రూ.3,61,000లు జరిమానా విధించారు. అలాగే అదనంగా మర్చంటైజ్డ్ గూడ్స్ సరుకులు రవాణా చేస్తున్న మరో బస్సు పై కేసు నమోదు చేసి రూ.10వేలు జరిమానా విధించారు. అలాగే సామర్థ్యానికి మించి సరుకులు రవాణా చేస్తున్న మూడు లారీలపై ఓవర్‌లోడు కేసు లు నమోదు చేసి వాటికి రూ.1.67 లక్షలు జరిమానా విధించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం రూ.5.38లక్షలు జరిమానా విధించినట్లు ఆర్‌టీఏ అధికారి క్రాంతి కుమార్ తెలిపారు.

ఉపాధి పనులు చేయించండి

రుద్రవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేయించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో గౌరీ బాయి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో ఉపాధి శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.